క్లుప్తంగా

నేడు ఉచిత ఖత్నా

పెద్దమండ్యం : మండలంలోని కలిచెర్ల పాతూరు మదరసా అరబి రషీదియాలో గురువారం ఉచిత ఖత్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మదరసా-ఏ- అరబియా రషీదియా కమిటీ వారి ఆధ్వర్యంలో ఖత్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్నారులకు డాక్టర్ సికిందర్ చికిత్స చేస్తారని చెప్పారు. ఉచిత ఖత్నా చేయించుకున్న చిన్నారులకు ఉచితంగా మందులు, భోజన సరుకులు పంపిణీ చేస్తున్నట్లు వారు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాలిసెట్ దరఖాస్తుకు గడువు పెంపు

మదనపల్లె సిటీ : పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్-2025 దరఖాస్తుకు గడువు పొడిగించినట్లు జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ ఓబులేసు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17వతేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యాబోధన

తంబళ్లపల్లె : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యాబోధన సాధ్యమని ఎంఈఓలు త్యాగరాజ, నాగసుబ్బరాయుడు తెలిపారు. మండలంలో బుధవారం నుంచి అన్ని పాఠశాల ఉపాధ్యాయులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా పాఠశాలల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లోనే చేర్పించే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులను చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలు, మెరుగైన విద్యాబోధన తెలియజేసి ప్రభుత్వపాఠశాల్లో చేర్పించాలని కోరుతున్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

మదనపల్లె సిటీ : గర్భిణులు పోషక ఆహారం తీసుకోవాలని సీడీపీఓ సుజాత అన్నారు. బుధవారం మదనపల్లె మండలం కొండామారిపల్లెలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, రెండు సంవత్సరాల పిల్లలు తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్యం గురించి తల్లలకు వివరించారు. మాతాశిశుమరణాలు తగ్గించడం కోసం గర్భంగా ఉన్నప్పటి నుంచి ప్రసవమై బిడ్డకు మూడు సంవత్సరాల వరకు తల్లి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రకాంత, కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

తంబళ్లపల్లె : మండలంలోని గోపిదిన్నె ఉన్నత పాఠశాల క్లస్టర్ పరిధిలోని పాఠశాలలకు బుధవారం విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్ క్లస్టర్ పరిధిలోని 24 ప్రాథమిక పాఠశాలలకు విద్యాసామగ్రిని అందజేశారు. ఆ సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని ఆయా హెచ్‌ఎంలకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

పీలేరు : అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక కేంద్ర అధికారి ఎస్. మస్తాన్ అన్నారు. బుధవారం స్థానిక కోడిహైట్స్ అపార్ట్‌మెంట్ వద్ద స్థానికులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంటలు ఎలా అదుపు చేయాలో డెమో చేసి చూపించారు. అగ్ని ప్రమాదాల నివారణ పద్ధతులపై కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని దుకాణదారులకు కరపత్రాలు అందజేసి అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది హేమాద్రిరెడ్డి, నాగిరెడ్డి, వెంకటేష్, రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయండి

రామసముద్రం : ఉపాధిహామీ పనుల్లో నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీఓ భానుప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలన్నారు. అలాగే ఫాం పాండ్స్, పశువుల నీటితొట్ల నిర్మాణంపై దృష్టి పెట్టాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు, ఈసీలకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ మాధవి, జేఈ రెడ్డీశ్వర్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

మదనపల్లె : ఆప్కాస్‌లో పని చేస్తున్న మున్సిపల్ (కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్) కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, జీఓ 36 ప్రకారం వేతనాలు రూ.21 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళనలు చేశారు. బుధవారం మదనపల్లి మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. కార్మికుల సంఖ్యను పెంచి పని భారం తగ్గించాలని, మృతి చెందిన పారిశుధ్య కార్మికుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, బకాయిలు విడుదల చేయాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ మనూజ రెడ్డి, కమిషనర్ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు.

మట్టి మాఫియా బరితెగింపు

మండలంలో మట్టి మాఫియా బరితెగిస్తోంది. అధికారులను సైతం లెక్కచేయడం లేదు. అడ్డుతగిలితే బెదిరింపులకు పాల్పడుతున్నారు. రామాపురం పంచాయతీ పరిధిలో లాల్‌మాను చెరువులో మట్టి తరలింపు ప్రక్రియ రెండురోజులుగా జోరుగా సాగుతోంది. కొంతమంది మట్టి మాఫియా సభ్యులు జేసీబీలతో మట్టిని తోడేసి టిప్పర్ల ద్వారా ఇష్టానుసారంగా తరలించేస్తున్నారు.

- రెవెన్యూ అధికారులపైనే తిరుగుబాటు
- అనుమతి లేదంటూ అడ్డుకొన్న వీఆర్‌ఓలు
- మీపరిధి కాదంటూ బెదిరింపు



లాల్‌మాను చెరువులో మట్టిని తరలిస్తున్న టిప్పర్లు

గుర్రంకొండ : మండల రెవెన్యూ అధికారులపై మట్టి మాఫియా తిరగబడ్డారు. మట్టితరలింపునకు అనుమతి లేదంటూ వీఆర్వోలు అడ్డుకోబోగా ఈ చెరువు మీ పరిధి కాదంటూ బెదిరింపులకు దిగిన సంఘటన మండలంలోని రామాపురంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రామాపురం పంచాయతీ పరిధిలో లాల్‌మాను చెరువులో మట్టి తరలింపు ప్రక్రియ రెండురోజులుగా జోరుగా జరుగుతోంది. కొంతమంది మట్టి మాఫీయా సభ్యులు చెరువులో జేసీబీలుతో మట్టిని తోడేసి టిప్పర్ల ద్వారా ఇష్టానుసారంగా తరలించేస్తున్నారు. గ్రామాల్లో మట్టిమాఫీయా ఆగడాలు శృతిమించిపోతుండడంతో గ్రామస్తులు బుధవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మొదటగా తరిగొండ వీఆర్వో అక్కడికి చేరుకోవడంతో అప్పటికే జేసీబీలు, టిప్పర్లతో చెరువు మొత్తం జాతరను తలపిస్తున్న దృశ్యాలు కంటపడ్డాయి. మట్టిని అనుమతి లేకుండా ఎలా తోడేస్తున్నారని వీఆర్వో వాటిని ప్రశ్నించి అడ్డుకొన్నాడు. ఈ చెరువు రామాపురం పంచాయతీ పరిధిలోకి వస్తుందని నీకు సంబంధం లేదంటూ సదరు వీఆర్వోను బెదిరించి వెనక్కు పంపించి వేశారు. కొద్దిసేపటి తరువాత రామాపురం చెరువు వద్దకు రామాపురం వీఆర్‌ఓ చేరుకొని మట్టిని తరలింపును అడ్డుకొన్నాడు. ఈచెరువు తరిగొండ పంచాయతీ పరిధిలోకి వస్తుందని నీకు సంబంధం లేదంటూ సదరు వీఆర్వోను మట్టి మాఫియ బెదిరింపులకు గురి చేశారు. మట్టి మాఫియా సభ్యులకు, వీఆర్వోకు మధ్య వాగ్వాదం చెలరేగి చెరువు వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఇక్కడే ఉంటే పోలీసుల సాయంతో కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని రెవెన్యూ అధికారులు హెచ్చరించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే రెవెన్యూ అధికారులు వెళ్లిపోయిన కొన్ని గంటల తరువాత షరామామూలే అన్నట్లుగా మళ్లీ మట్టి మాఫీయా మట్టి తరలింపు ప్రక్రియను యథేచ్ఛగా సాగించడం గమనార్హం. టిప్పర్లు, జేసీబీల హడావిడి, రాకపోకలతో అక్కడి గ్రామ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈవిషయమై తహసీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా లాల్‌మాను చెరువులో కొంతమంది అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సంఘటనపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొంటామన్నారు.

వెలుగులో విద్యార్థుల సేవా కార్యక్రమం

మదనపల్లె సిటీ : స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో నారాయణ కాలేజీ విద్యార్థులు బుధవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇటీవల ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో మొదటి సంవత్సరం ఎంపీసీలో 466 సాధించిన నివేదితతో పాటు ద్వితీయ సంవత్సరంలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులతో కలిసి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. దివ్యాంగ విద్యార్థులకు స్నాక్స్ అందజేశారు. కాలేజీ డీజీఎం కొండలరావు, ప్రిన్సిపాల్స్ తారకరామనాయుడు, సురేష్, బాలకృష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. నివేదితకు వెలుగు సెక్రటరీ ఉదయమోహన్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

మదనపల్లె : మున్సిపల్ సిబ్బంది విషయంలో వివక్ష కనబరిచిన మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ మదనపల్లె అసెంబ్లీ ఇన్‌చార్జ్ సి.రవణప్ప ఆధ్వర్యంలో బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్దిరోజుల క్రితం మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్సీ కులానికి చెందిన కె.శ్రీనివాసులుపై, అదే కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న యం.మురళి, టాక్స్ విషయంలో జరిగిన వివాదం కారణంగా దాడిచేశాడన్నారు. ఈ విషయంలో బాధితుడు శ్రీనివాసులు, కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తే.. ఆమె పట్టించుకోకపోవడంతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయించామన్నారు. దీంతో మున్సిపల్ కమిషనర్ గొడవ పడిన ఇద్దరు ఉద్యోగుల విషయమై ఆర్‌డీకి పంపిన నివేదిక ఆధారంగా కుప్పంకు బదిలీ చేశారన్నారు. దెబ్బలు తిన్న బాధితుడి ట్రాన్స్‌ఫర్‌కు నివేదిక పంపిన కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నిరసన అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

స్వచ్ఛమైన ఓటరు జాబితా సిద్ధం చేయండి

పీలేరురూరల్ : ఎన్నికల కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్వచ్ఛమైన ఓటరు జాబితా సిద్ధం చేయాలని మదనపల్లె స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్రరావు అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పీలేరు అసెంబ్లీ 163 నియోజకవర్గ స్థాయి తహసీల్దార్లు, రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 281 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. అందులో 1200 ఓటర్లుకు మించిన పోలింగ్ కేంద్రాలు 20 ఉన్నాయని, వాటిని పునర్విభజన చేయాలన్నారు. ఓటరు జాబితాలో తప్పు ఒప్పులను సరి చేయాలని సూచించారు. అర్హులైన యువతీ యువకులు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మృతి చెందిన, ఊరి వదలి వెళ్లిన వారి పేర్లు తొలగించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్‌లు ఎం. భీమేశ్వర్‌రావు, పామిలేటి ఫణికుమార్, నరేంద్ర, మహేశ్వరిబాయి, డీటీ చంద్రశేఖర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మదనపల్లె స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్రరావు

వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని నిరసన

మదనపల్లె : మండలంలోని కొత్తవారిపల్లె వీఆర్వో అవినీతిపై చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీవైఎస్ అధ్యక్షులు పునీత్ మాట్లాడుతూ...కొత్తవారిపల్లె వీఆర్వో భరత్ కొన్నేళ్లుగా మదనపల్లె మండలంలో పాతుకుపోయి పెద్ద మొత్తంలో అవినీతికి పాల్పడుతూ కోట్లకు పడగలెత్తాడని ఆరోపించారు. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉండటమే కాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు నిర్వహిస్తున్నారన్నారు. ఆయన గతంలో అంకిశెట్టిపల్లె వీఆర్వోగా పనిచేసేటప్పుడు గ్రామకంఠం భూములను డబ్బులు తీసుకుని ఇతరులకు ధారాదత్తం చేసిన విషయమై అప్పట్లోనే ప్రజాసంఘాలు నిరసన తెలిపాయన్నారు. హంద్రీనీవా సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో ఇసుక తవ్వకాలు జరిపి లక్షలు ఆర్జించారనే ఆరోపణలు ఇతడిపై ఉన్నాయన్నారు. గతంలో పనిచేసిన తహసీల్దార్ ఖాజాబీ, ఇతడిని కలెక్టరేట్‌కు సరెండర్ చేస్తే రాజకీయ, అధికార పలుకుబడితో తిరిగి మదనపల్లె మండలానికి పోస్టింగ్ తెచ్చుకున్నారన్నారు. రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ నిర్వహిస్తే మరిన్ని అక్రమాలు వెలుగుచూసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు సురేష్, ఆది, శశికుమార్, హరి, శ్రీనివాసులు, వినయ్, ద్వారక, వినయ్, శివ, జిలానిబాష, హరి, మురళి, రాజేష్, నాగరాజ, దేవేష్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీవైఎస్ నాయకులు

ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటించాలి

పీలేరు : ఆటో కార్మికులు ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటించాలని ఎస్‌ఐ లోకేష్ అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో ఐఎన్‌టీయూసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలపై కార్మికులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఐఎన్‌టీయూసీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రత్నకుమార్, మురళీధర్ మాట్లాడుతూ ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. సీపీఎస్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ ఆనంద బాబు, రామ్మూర్తి, ఐఎన్‌టీయూసీ నాయకులు బోదేషా, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఐ లోకేష్

పాలేటి గంగమ్మ విగ్రహ ప్రతిష్టాపనకు విరాళం

మదనపల్లె : మండలంలోని చిప్పిలి గ్రామంలో శ్రీ పాలేటి గంగమ్మ నూతన విగ్రహ ప్రతిష్టాపనకు పీఎస్‌ఆర్ గ్రూప్ చైర్మన్ పి.సి.శివశంకర్‌రెడ్డి(పెద్దపల్లి), పి.సి.లక్ష్మీప్రసన్న దంపతులు విరాళం అందించారు. బుధవారం ఉదయం పాలేటి గంగమ్మ భక్త సంఘం ప్రెసిడెంట్ ఎస్.విశ్వనాథరెడ్డికి రూ.1.50లక్షకు సంబంధించి చెక్కును అందజేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దాత శివశంకర్‌రెడ్డి కుటుంబానికి అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆశీర్వదించారు.



విరాళం అందిస్తున్న పి.సి.శివశంకర్‌రెడ్డి దంపతులు

21లోపు ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించాలి

మదనపల్లె సిటీ : అడ్వాన్స్‌డ్ ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు ఈనెల 21వతేదీ లోపు చెల్లించాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణమూర్తి తెలిపారు. బుధవారం స్థానిక కాలేజీలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు తప్పనిసరిగా ఫీజు చెల్లించి మే రెండవ వారంలో నిర్వహించే పరీక్షలు రాయాలని సూచించారు. ఫెయిల్ అయిన విద్యార్థులు సబ్జెక్టు అధ్యాపకులతో తగిన సలహాలు పొందాలన్నారు. పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు మొదటి సంవత్సరం కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాలేజీలో ఎంపీసీ, బైపీసీ,సీఈసీ,హెచ్‌ఈసీ, ఎంబైపీసీ, జనరల్ కోర్సులు నర్సింగ్, సిరికల్చర్, అకౌంట్ టాక్సేషన్, సివిల్ ఇంజినీరింగ్ టెక్నాలజీ ఉన్నాయన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి

బి.కొత్తకోటలో భారీ వర్షం

బి.కొత్తకోట : ఒక్కసారిగా భీకర ఉరుములు, మెరుపులతో బుధవారం సాయంత్రం బి.కొత్తకోటలో భారీ వర్షం కురిసింది. గంటకుపైగా కురిసిన భారీ వర్షంతో పట్టణంలోని వీధులన్నీ జలమయ్యాయి. వర్షపునీటితో మురికినీటి కాలువలు సరిపోకపోవడంతో రోడ్లపై ప్రవహించాయి. మురికినీరు, మట్టితో వీధులు దుర్గంధమయ్యాయి. జ్యోతిచౌక్‌లో పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. దిగువబస్టాండ్, పంచాయతీవీధి, వాయలవంక, శెట్టిపల్లెరోడ్డు ప్రాంతాల్లో వర్షపునీళ్లు ఇళ్లలోకి వచ్చాయి. ప్రజలు ఇళ్లలోని నీటిని తోడేందుకు ఇబ్బందులు పడ్డారు. కాలువలోని నీళ్లు ఇళ్లముందుకు రావడంతో ప్రజలు వాటిని శుభ్రం చేసుకోవాల్సి వచ్చింది. మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై పది నిమిషాల పాటు కురిసిన భారీవర్షంతో వడగళ్లు కురిశాయి.

మదనపల్లెలో వర్షం

మదనపల్లె సిటీ : మదనపల్లెలో బుధవారం రాత్రి ఓ మోస్తారు వర్షం కురిసింది. ఎండ వేడిమికి అల్లాడిపోతున్న ప్రజలు వర్షం కురవడంతో వాతావరణ చల్లగా మారిపోయింది. రోడ్లన్నీ జలమయ్యాయి.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె : ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ మహేంద్ర హెచ్చరించారు. బుధవారం స్థానిక డీఎస్పీ కార్యాలయం వద్ద పట్టణంలోని పట్టణంలోని ఆటో డ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. తప్పనిసరిగా యూనిఫాం ధరించి డ్రైవింగ్ చేయాలన్నారు. లైసెన్సు లేకుండా ఆటోలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఓవర్‌లోడుతో నడపకూడదన్నారు. ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు ఆటోలు వినియోగిస్తే కేసులు నమోదుతో పాటు లైసెన్సులు రద్దు చేయిస్తామన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆటో డ్రైవర్లు సెల్ ఫోన్ చూస్తూ, మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే ఉపేక్షించబోమన్నారు. ఆటోల ముందు,వెనుక, పైభాగాల్లో నిబంధనలకు విరుద్ధంగా అధిక వెలుగులు నింపే ఎల్‌ఈడీ బల్బులను వాడుతూ, ఎదురుగా వచ్చే వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆటో డ్రైవర్ల ప్రవర్తనపై ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వన్‌టౌన్‌సీఐ ఎరిసావల్లి, క్రైమ్ సీఐ చంద్రశేఖర్, వన్‌టౌన్ ఎస్.ఐ శివకుమార్ తేదితరులు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ మహేంద్ర

మైనర్లకు వాహనాలివ్వడం నేరం

కలికిరి : మైనర్లకు వాహనాలివ్వడం నేరమని సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లు, వాహనదారులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు మైనర్లు వాహనాలు నడుపరాదన్నారు. మైనర్లకు వాహనాలిచ్చిన వారిపై కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారం రోజుల పాటు అవగాహన కల్పిస్తాం..అనంతరం కూడా మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే యజమానితో పాటు అతనిపై కూడా కేసు నమోదు చేస్తామన్నారు. అలాగే వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించి డ్రైవింగ్ చేయాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక

పెద్దమండ్యం : గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం సందర్భంగా ఇద్దరు సీఐలు, ముగ్గురు ఎస్‌ఐల ఆధ్వర్యంలో 30 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌కూడలి వద్ద, ఎంపీడీఓ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద, కార్యాలయంలో లోపల గేటు వద్ద మూడు చోట్ల చెక్ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, కూటమి ప్రభుత్వం సూచించిన ఐదుగురిని పోలీసులు కార్యాలయం లోపలికి పంపారు. సమావేశాన్ని ఎంపీడీఓ శ్రీధర్‌రావు ప్రారంభించగా, ఆయా శాఖల అధికారులు తమ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. మండలంలోని గ్రామాలలో ఎక్కడైనా వేసవి సందర్భంగా తాగునీటి సమస్య ఏర్పడితే తక్షణమే సమస్య పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తాగునీటి సమస్య ఉన్న మూడు గ్రామాలలో ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జేజేఎం ద్వారా 13 పనులు చేపడుతున్నట్లు ఏఈ అశోక్‌కుమార్ తెలిపారు. ప్రతి గ్రామ సచివాలయం వద్ద కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. అలాగే పాపేపల్లె శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కలిచెర్ల మౌలాకా పహాడ్ వద్ద కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. పల్లె పండుగ ద్వారా రెండవ విడతలో 17 గ్రామ పంచాయతీలలో 122 పనులు చేపట్టి, 18 కిలోమీటర్లు సిమెంటు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు పీఆర్ ఏఈ షాబాజ్ తెలిపారు. రెండవ వడతలో 612 మందికి పక్కాగృహాలు మంజూరైనట్లు ఆ శాఖ ఏఈ అక్రమ్ తెలిపారు. స్వయం సహాయక సంఘాలలోని మహిళలకు బ్యాంక్‌లింకేజి, స్త్రీనిధి, ఉన్నతి ద్వారా రుణాలను ఇస్తున్నట్లు ఏపీఎం నరసింహులు తెలిపారు. విద్యాశాఖలో వచ్చిన నూతన సంస్కరణలో భాగంగా మండలంలో 11 మోడల్ ప్రై మరీ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఈవో మనోహర తెలిపారు. జీఓ 30 ప్రకారం గ్రామాలలో ఎక్కడైనా గ్రామకంఠంలో ఇండ్లను నిర్మించుకొని ఉన్న వారికి నిబంధనల మేరకు రుసుం చెల్లిస్తే ఆ ఇంటిని వారి పేరుతో రిజిష్టరు చేయిస్తామని తహసీల్దార్ సయ్యద్‌అహ్మద్ తెలిపారు. మండలంలోని వెలిగల్లులో రీసర్వే పనులు జరుగుతున్నట్లు తహసీల్దార్ చెప్పారు. రీసర్వేలో ఎదురవుతున్న సమస్యలు అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. మండల అభివృద్ధికి పార్టీలకు అతీతంగా అందరు సహకరించాలని ఎంపీపీ కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పీరమ్మ, వైస్ ఎంపీపీలు టి జయచంద్రారెడ్డి, శారదమ్మ, సర్పంచ్‌లు సోదనపల్లె బాషా, ములకబయ్యారెడ్డి, జింకా విశ్వనాథ, కంటి విశ్వనాథరెడ్డి, సుధాకరనాయుడు, ఎంపీటీసీ సభ్యులు మంచూరి జయరాం, బోడెం రవితేజ, బోడిమాని గీత, నరసమ్మ, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక

శక్తియాప్‌తో మహిళలకు భద్రత



శక్తియాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ గాయిత్రి

మదనపల్లె : శక్తి యాప్ వినియోగం ద్వారా మహిళలు, విద్యార్థినులు తగిన రక్షణ,భద్రత కలుగుతుందని తాలూకా ఎస్‌ఐ గాయిత్రి అన్నారు. బుధవారం మండల పరిధిలోని బసినికొండ పంచాయతీ గంగన్నగారిపల్లెలోని క్రిష్ణచైతన్య ఫార్మసీ కాలేజీలో విద్యార్థినులకు శక్తియాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మహిళలు, విద్యార్థులు తప్పనిసరిగా తమ మొబైల్‌లలో శక్తియాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. ఆపద సమయంలో యాప్ ఓపెన్ చేసి ఎస్‌ఓఎస్‌ను నొక్కిన వెంటనే పదినిమిషాల్లో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుంటారన్నారు. ముఖ్యంగా ఆకతాయిల వేధింపులు, ఈవ్‌టీజింగ్‌తో పాటు ఇతర సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులను ఆశ్రయించేందుకు శక్తియాప్ ద్వారా మార్గం సుగమం అవుతుందన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించండి



విద్యార్థులతో కలసి ఆరోగ్య సిబ్బంది ర్యాలీ

మదనపల్లె సిటీ : వడదెబ్బతగలకుండా జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్యవిద్యాధికారి మహమ్మద్‌రఫీ అన్నారు. బుధవారం మదనపల్లె మండలం సీటీఎం, బసినికొండ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎండలు రోజు రోజుకు అధికంగా పెరుగుతున్నాయన్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు తలపై టోపీ,గొడుగు వాడాలన్నారు. వీలైనంతవరకు ఉదయమే పనులు పూర్తి చేసుకోవాలన్నారు. అలాగే మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికన్‌గున్యా, మెదడ వాపు వ్యాధులు గురించి తెలియజేశారు. వ్యాధుల ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి కలీలుల్లాఖాన్, సీటీఎం ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్ శ్రీధర్

పీలేరు : ఒలింపియాడ్ పోటీ పరీక్ష ఫలితాల్లో రాణించిన పీలేరు విద్యార్థులకు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఐఎస్‌టీఎస్‌వో ఒలింపియాడ్ పోటీ పరీక్షల్లో పీలేరులోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. విద్యార్థులు పూల పవన్ కల్యాణ్ గ్రాండ్ ప్రైజ్ ల్యాప్‌టాప్ తోపాటు గోల్డ్ మెడల్ సాధించాడు. అలాగే పలువురు విద్యార్థులు వివిధ బహుమతులు సొంతం చేసుకున్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. కార్యక్రమంలో ఏజీఎం సురేష్, ఆర్ఐ శ్రీధర్, ప్రిన్సిపాల్ సుమన్‌గౌడ్, సిబ్బంది రవికుమార్, జానకిరామ్, సునంద తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ బి. శివశంకర్

పీలేరు రూరల్ : మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరి చాలని ఎంపీడీఓ బి. శివ శంకర్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్, గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో నీటిని వృథా కానివ్వకుండా పైపులైన్లు, గేటువాల్వులు ఎప్పటికప్పుడు మరమ్మతు చేపట్టాలన్నారు. హౌసింగ్ డీఈ రమణయ్య, ఈవోపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇరగన్న పాల్గొన్నారు.